## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



వధువరులను ఆశీర్వదిస్తున్న మాజీ పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 9: జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ గార్డెన్‌లో బుధవారం జరిగిన పెండ్లికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, నాయకులు యాదగిరి, ఆంజనేయులు, శ్రీనివాస్, కిరణ్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మాయ గార్డెన్‌లో హావేళీఘనపూర్ మాజీ జడ్పీటీసీ సుజాత శ్రీనివాస్‌రెడ్డి కూతురు నిశ్చితార్థంలో పాల్గొని జంటను ఆశీర్వదించారు.

## పంచాయతీ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తూ, నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్, ఏప్రిల్ 9: జీడిపల్లిలో పంచాయతీ కార్మికులు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఐదు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వాపోయారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు అర్జున్, భూపాల్, సత్యనారాయణ, రాంచందర్, ముత్యాలమ్మ, రేణమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్లు మంజూరు



వల్లూర్‌లో సీసీ రోడ్లను ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి

చేగుంట, ఏప్రిల్ 9: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో చేగుంట, నార్సింగి మండలాల్లోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు బుధవారం శంకుస్థాపనలు చేశారు. నార్సింగి మండలం వల్లూర్‌లో సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, మాజీ సర్పంచ్ అంబరీష, గ్రామ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ వహీద్, నర్సింహులు, సురేశ్, జనార్దన్, శేఖర్ ఉన్నారు. మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి రూ.15 లక్షల ఎన్ఆర్‌జీ నిధులతో సీసీ రోడ్లు ప్రారంభించారు.

## ఇందిరమ్మ ఇండ్లకు హల్దీవాగు ఇసుక

వెల్దుర్తి, ఏప్రిల్ 9: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను మండలంలో ప్రవహిస్తున్న హల్దీవాగులో నుంచి తరలించడం కోసం నేడు సర్వే నిర్వహించనున్నట్లు తహసిల్దార్ కృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తితో పాటు నెల్లూర్, ఉప్పులింగాపూర్, కొత్తపల్లి, కుకునూర్, దామరంచ గ్రామాల్లోని వాగులో ఉన్న ఇసుక రీచ్‌లను అధికారుల బృందం పరిశీలించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

### ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి

అల్లాదుర్గం, ఏప్రిల్ 9: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని నడిమితండాలో లబ్ధిదారుల ఇంటింటికీ తిరిగి పనులు చేపట్టాలని అవగాహన కల్పించారు. బీస్‌మెంట్ పూర్తి కాగానే రూ.లక్ష విడుదల చేస్తామన్నారు. ఆయనతో ఏపీఎం నాగరాజు, తదితరులు ఉన్నారు.

## కుమారుడి వివాహమైన గంటకే తల్లి మృతి



లక్ష్మీనర్సమ్మ (ఫైల్)

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9: కుమారుడి వివాహం జరిగిన గంటకే తల్లి మృతి చెందిన ఘటన మండలంలోని సూరారంలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లక్ష్మీ నర్సమ్మ(48), శ్రీనివాస్‌గౌడ్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి రవీందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్ ఇద్దరు కుమారులు. కొంతకాలంగా లక్ష్మీ నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నది. తల్లి కోరిక మేరకు పెద్ద కుమారుడు రవీందర్‌గౌడ్ వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. బుధవారం ఉదయం 8గంటలకు మెదక్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రవీందర్‌గౌడ్ వివాహం జరిగింది. పెళ్లయిన గంటలోనే తల్లి మృతి చెందిందనే వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న గంగారాం

రామాయంపేట, ఏప్రిల్ 9: పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దామని బీసీ సక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగా రాం పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశం లో క్రమ శిక్షణ విభాగ్ జిల్లా అధ్యక్షుడు పోచమ్మల గణేశ్, కోశాధికారి సుంకోజు దామోదర్, మామిడి సిద్దిరాములు, పిట్ల శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## గిరిజన తండాలో అవగాహన

రామాయంపేట, ఏప్రిల్ 9: దంతెపల్లి బాపనయ్య గిరిజన తండాలో కళాకారులు బుధవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నివారణ, డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



అల్లాదుర్గం, ఏప్రిల్ 9: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు అల్లాదుర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం అందజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చేగుంట, ఏప్రిల్ 9: చేగుంటకు చెందిన గడ్డమీది స్వరూప అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. బాధిత కుటుంబానికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి బియ్యం, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

# ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించాలి



చేగుంట మండల రైతులతో కలిసి మాచిన్‌పల్లి వద్ద కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వడియారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



రుక్మాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రారంభించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- రజాకార్లను ఎదిరించిన వీరవనిత ఐలమ్మ
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఏప్రిల్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేగుంట, గజ్వేల్ రహదారిలోని మాచిన్‌పల్లి చౌరస్తా వద్ద కెనాల్‌ను పరిశీలించారు. చేగుంట మండలంలోని పోతాన్‌పల్లి, కసాన్‌పల్లి, చందాయిపేట, పెద్ద శివునూర్ గ్రామాల రైతులు సాగు నీటికోసం ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో బుధవారం ఫారెస్టు, ఇరిగేషన్, రహదారులు, విద్యుత్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో రైతులకు ఇబ్బందులు లేకుండా రెండు పంటలకు కావాల్సిన సాగు నీటిని అందించేందుకు ప్రాజెక్టులు నిర్మించారన్నారు. కాలువల ద్వారా చెరువులు, కుంటలు, చెక్ డ్యాముల్లో నీళ్లు వచ్చేలా కృషి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా రైతులకు సాగు నీరు అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఉప కాలువలు నిర్మిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

### చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

రజాకార్లను ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె స్ఫూర్తితో ముందుకుపోవాలని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని రుక్మాపూర్‌లో మ్యాకల రుచిత జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు శోభస్వామి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అందించారు. గ్రామంలోని రజక కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

### కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వడియారం, అనంతసాగర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఐకేపీ, సహకారం సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను దుబ్బాక ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని, ఎక్కువ తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బులు తొందరగా వచ్చేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కా ర్యక్రమంలో చేగుంట, దౌల్తాబాద్ మండల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కోమండ్ల నారాయణరెడ్డి, రణం శ్రీనివాస్, జిల్లా నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచులు శ్రీనివాస్, మోహన్‌రాథోడ్, పట్నం తానీషా, నెల్లూర్, మహ్మద్ అలీ, హోళియనాయక్, రాములు, అంజిరెడ్డి, రాజు, రమేశ్, తహసీల్దార్ శ్రీకాం త్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏవో హరిప్రసాద్, మాధవి, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఏఈ దివ్యశ్రీ, గాండ్ల లత నందం, మైలరాం రాంచంద్రం, రజక సంఘం జిల్లా అధ్యక్షు డు సంఘ స్వామి, ఉపేందర్, విజయ్,నరసింహ,మండల శాఖ అధ్యక్షుడు చింతకింది రామచంద్రం,జలాల్‌పూర్ శంకర్ గ్రామ అధ్యక్షుడు ఆంజనేయులు, నరసింహులు, రామస్వామి, రమేశ్, శ్రీశైలం, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏవో హరిప్రసాద్, మాధవి, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

## హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం



నర్సాపూర్, ఏప్రిల్ 9: ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నర్సాపూర్‌లో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి హనుమాన్ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సతీష్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, గోపి, కార్తిక్, వినయ్, సద్గుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నర్సాపూర్, ఏప్రిల్ 9: రాంచంద్రాపూర్ సమీపంలో నిర్మించిన ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. కన్వెన్షన్ హాల్ నిర్వాహకుడు కట్ట సంతోష్‌కుమార్ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, మన్సూర్, శ్రీశైలం, నర్సింగరావు, భిక్షపతి, సేనాధిపతి, జితేందర్‌రెడ్డి, కరుణాకర్, సూరారం నర్సింహులు, చింత స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నెత్తిన గుదిబండ



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

- వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు
- మెదక్ జిల్లాపై రూ.1.17 కోట్ల భారం

మెదక్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడంతో సామాన్యులపై మరింత భారం పడనున్నది. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతుంటే గ్యాస్ గుదిబండ నెత్తినపడడంతో మరిన్ని ఇబ్బందులు భరించక తప్పదు. సామాన్యులకు అన్నివిధాలా అండగా ఉంటామని చెబుతూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వారిపై మరింత భారాన్ని మోపుతున్నాయి. ఒకవైపు గ్యాస్‌ను వినియోగించాలని ప్రోత్సహిస్తూ మరోవైపు ధరలు పెంచుతూ నడ్డివిరుస్తున్నాయి. తాజాగా 14.2 కిలోల గృహ అవసరాల సిలిండర్ ధర రూ.922గా నిర్ణయించారు. ఆయా ధరలు పెరుగుతుండడంతో ప్రజలు ఆర్థిక భారంతో సతమతం అవుతున్నారు.

### మెదక్ జిల్లాలో 2.14 లక్షల కుటుంబాలు

మెదక్ జిల్లాలో 2.14 లక్షల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,35,412 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. 17 ఏజెన్సీల ద్వారా సిలిండర్‌లు సరఫరా చేస్తున్నారు. సరాసరిన నెలకు ఒక్కో గ్యాస్ సిలిండర్ చొప్పున వినియోగిస్తే వంటింటి బడ్జెట్‌పై అదనంగా రూ.50 చొప్పున రూ.1.17 కోట్ల మేర ఆర్థిక భారం పడనున్నది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.872గా ఉండగా, పెరిగిన ధరతో రూ.922కు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం గృహ లక్ష్మీ పథకం కింద రూ.500లకే సిలిండర్ అందజేస్తోంది. సిలిండర్ బుక్ చేసినప్పుడు రూ.922 చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద రూ.550కే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో వంటింట్లో గ్యాస్ బండ గుది బండలా మారుతోంది.

### జిల్లాలో 2,35,412 గ్యాస్ కనెక్షన్లు

మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,35,412 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి ఇందులో గృహవసరాల కనెక్షన్లు 1,08,688 ఉండగా, సీఎస్ఆర్ 29,485, ఉజ్వల 33,618, దీపం కనెక్షన్లు 63.161 ఉన్నాయి. 17 ఏజెన్సీల ద్వారా సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీకి ఐదు కిలోమీటర్ల పరిధిలోని కనెక్షన్లకు రవాణా చార్జీలు వసూలు చేయకూడదు. 15 కిలోమీటర్ల వరకు రూ.20, ఆపైన దూరంలోని వినియోగదారులకు ఇంటికి చేర్చినందుకు రూ.30 చార్జీలుగా నిర్ణయించారు. గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సిబ్బంది నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఐదు కిలోమీటర్లలోపు అదనంగా రూ.30 నుంచి రూ.40 వరకు, 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉంటే రూ.50 వరకు తీసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి: సీఐటీయూ

రామాయంపేట, ఏప్రిల్ 9: గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. మే 3, 4వ తేదీల్లో రామాయంపేటలో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మహేందర్, స్వామి, బాబు ఉన్నారు.

### గ్యాస్ ధరను తగ్గించాలి: సీపీఐ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 9: పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా కార్యదర్శి ఖాలేక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరను ఉపసంహరించుకోవాలన్నారు.

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ చౌరస్తా వద్ద బుధవారం దహనం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ మాట్లాడుతూ ముడి చమురు ధరలు తగ్గినా సిలిండర్‌పై రూ.50 పెంచడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, మహేందర్‌రెడ్డి, సంతోష్, భాను, సత్యం, రాణి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీల ఐక్యతకు కృషి చేయాలి



వార్షికోత్సవంలో పద్మశాలీ సంఘం నాయకులు

శివ్వంపేట, ఏప్రిల్ 9: పద్మశాలీల ఐక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పద్మశాలీ సంఘం గ్రామ అధ్యక్షుడు, టీఆర్‌పీఎస్ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు గజేంద్రుల నర్సింహులు, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు తెలిపారు. దంతాన్‌పల్లిలో వారి ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గం ఆంజనేయులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు యాదగిరి, పద్మనాభం, వడియారం పద్మశాలీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, దొంతి అధ్యక్షుడు నాగరాజు, జిల్లా సీనియర్ నాయకులు సిలువేరు వీరేశం, రమేశ్, సత్యనారాయణ, సుదీర్, దంతాన్‌పల్లి కార్యవర్గం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## మిస్టరీగా చిన్నారి మిస్సింగ్

### నదిలో పడేశారని ఆరోపణలు

చిలిపిచెడ్, ఏప్రిల్ 9: ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లి ఆ శిశువును అమ్ముకున్నదా? లేక ఇతర వ్యక్తులు అమ్ముకున్నారా అనే విషయం మెదక్ జిల్లాలోని ఓ గిరిజన తండాలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వివరాలు .. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం టోప్యితండాకు చెందిన ఓ మహిళకు కౌల్చారం మండలం వరిగుతం గ్రామ పంచాయతీలోని సీతారాం గిరిజన తండాకు చెందిన వ్యక్తితో రెండేండ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక ఆడపిల్ల పుట్టింది. పాప పుట్టిన తర్వాత ఆ భార్యభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో భర్త కు చెప్పకుండా ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ ఘటనలో తన భార్య, కూతురు కనిపించకుండా పోయారని భర్త కౌల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో తల్లి దొరికింది. ఆరునెలల ఆడపిల్ల మిస్సింగ్ అయ్యింది. కాగా. బుధవారం ఈ విషయంలో చిలిపిచెడ్ మం డలం టోప్యితండాల్లో అంగన్‌వాడీ టీచర్ తల్లి, చిన్నారి తల్లి ఇద్దరు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో అసలు విషయాలు బయటపడ్డాయి. 'నీ బిడ్డను మం జీరా నదిలో నీ తండ్రే పడేశాడని అంగన్‌వాడీ టీచర్ తల్లి దాడి సమయంలో నోరుజారింది. నా బిడ్డను అంగన్‌వాడీ టీచరే మంజీరాలో పడేసిందని చిన్నారి తల్లి ఆరోపించారు. అంగన్‌వాడీ టీచర్ వల్లే తన జీవితం నాశనమైందన్నది. ఈ విషయం టోప్యితండా వాసులందరికీ తెలిసింది. చిలిపిచెడ్, కౌల్చారం పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, ఘటన వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



పెద్దశంకరంపేట, ఏప్రిల్ 9: పెద్దశంకరంపేటలో ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వడదెబ్బ తగలకుండా లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ కలుపుకొని తాగాలని సూచించారు.

## ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



మిరుదొడ్డి, ఏప్రిల్ 9 : మండలంలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక ఎంఈవోలు ప్రవీన్ బాబు, అంజాగౌడ్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

### బైక్ ఫైనాన్స్ వేధింపులతో యువకుడి ఆత్మహత్య

వెల్దుర్తి, ఏప్రిల్ 9: ఫైనాన్స్‌లో బైక్ కొనుగోలు చేసిన ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో డబ్బులు చెల్లించక పోవడంతో వారు బైక్‌ను తీసుకెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నడు. ఈ ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మానేపల్లిలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వి వరాల ప్రకారం.. ప్రశాంత్(20) ఏడాది కిందట వెల్దుర్తిలోని ఓ బైక్ షోరూంలో కొన్ని డబ్బులు కట్టి, మిగతా డబ్బులు ఫైనాన్స్‌లో తీసుకుని బైక్ కొన్నాడు. అనంతరం ప్రతి నెలా వాయిదాలు సరిగ్గా చెల్లించకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఫై నాన్స్ నిర్వాహకులు బైక్‌ను తీసుకెళ్లారు. దీంతో అప్పటి నుంచి మనస్తాపానికి గురైన ప్రశాంత్ బుధవారం ఉదయం వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకు ని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట, ఏప్రిల్ 9: అదనపు కట్నం కోసం వేధించిన అత్త, మామ, ఆడపడుచు, మరిదిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉసిరికపల్లికి చెందిన పూజితను 2022లో పూడూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. ఏడు నెలలకే పూజిత భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి కొన్ని రోజులు తల్లిగారి ఇంటి వద్ద, కొన్ని రోజులు పూడూరులో పూజిత ఉంటున్నది. భర్త చనిపోయినా ఎందుకు ఇక్కడికి వస్తున్నావంటూ వారు వేధిస్తున్నారు. తల్లిగారి ఇంటి నుంచి అదనంగా కట్నం తెస్తేనే రానిస్తామని వేధిస్తున్నారు. తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్న అత్త నాగమణి, మామ భూపాల్‌రెడ్డి, ఆడపడుచు శిల్ప, ఆమె భర్త హర్షవర్ధన్‌రెడ్డి, మరిది మల్లారెడ్డిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


### కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

నిజాంపేట, ఏప్రిల్ 9: నిజాంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. బుధవారం ఎంపీడీవో రాజిరెడ్డి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్, మీసేవ తదితర ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆయనతో జూనియర్ అసిస్టెంట్ నర్సింహులు ఉన్నారు.

### వేధింపులకు పాల్పడిన భర్త, అత్తపై కేసు

శివ్వంపేట, ఏప్రిల్ 9: వివాహితపై వేధింపులకు పాల్పడిన భర్త, అత్తలపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంతాన్‌పల్లికి చెందిన చెల్లి ప్రవీణ్‌కుమార్‌కు వెల్దుర్తి మండలం మన్నెవారి జలాల్‌పూర్ నుంచి వినోదతో 15 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లుగా భర్త ప్రవీణ్ కుమార్, అత్త సత్యమ్మ అదనపు కట్నం కోసం వేధించగా, అప్పట్లో గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెద్దల సమక్షంలో మాట్లాడినా ఫలితం లేదు. ఇటీవల మార్చి 31న రాత్రి భర్త, అత్తల వేధింపులకు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. భర్త, అత్త వేధింపుల వల్లే తన కూతురు మృతి చెందిందని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### రాజా శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ



పాపన్నపేట, ఏప్రిల్ 9: పాపన్నపేట మండలంలోని దౌలాపూర్‌కు చెందిన రాజా శ్రీకాంత్‌రెడ్డి నాన్న రాజా శ్రీధర్‌రెడ్డి మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నాయకులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా నా క్లయింట్ దిగువ తెలిపిన వాటిని కొనుగోలు చేయదలిచారు:

రామాయంపేట్ గ్రామం, రామాయంపేట్ మండలం, మెదక్ జిల్లా వద్ద గల, సర్వే నెం.118/ఆలో 294.66 చ.గజాల విస్తీర్ణపు ఖాళీ ప్లాట్‌పై మాత్రమే గ్రౌండ్ ఫ్లోర్ కలిగిన, ఇంటి నెం.16-96/8 యావత్తు, శ్రీమతి సురనేని ప్రేమల భర్త శ్రీ హరితరావు (యజమాని)కి చెందినది.

ఎవరికైనా పై సదరు విషయానికి సంబంధించి ఏదేని అభ్యంతరం లేదా ఇతర సమాచారం కలిగి ఉన్నచో వారు సదరు ప్రకటన తేదీ నుండి ఏడు (7) రోజులలోగా వ్రాతపూర్వకంగా అభ్యంతరాలను మరియు అన్ని సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును, ఎలాంటి అభ్యంతరాలను అందనిచో ఎటువంటి క్లెయింలు లేవని భావించబడును మరియు ఆతరువాత అందిన ఏవేని క్లెయింలు పరిగణించబడవు. నా క్లయింట్ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు.

**దేవాకర్.పి, అడ్వకేట్**

ప్లాట్ నెం.180/పి, త్రిమూర్తి కాలనీ, రోడ్ నెం.4, మహేంద్ర హిల్స్, సికింద్రాబాద్-500026, ఫోన్: 27055585/ 27716501/ 27731757/ 27735558, మొబైల్ నెం.9849025380